## క్లుప్తంగా

### వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి


నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: వర్షం కురిసినప్పుడు కొత్తపేట డివిజన్ కమర్షియల్ టాక్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద నీరు నిలుస్తుందని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన కమర్షియల్ టాక్స్ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సంబంధిత అధికారులను పిలిపించి ఈ సమస్యకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని ఆదేశించారు. కార్పొరేటర్ వెంట ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్ ఉన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న విజయరంగ

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట చైర్మన్ డాక్టర్ లయన్ విజయరంగ అన్నారు. కొత్తపేటలోని ఆదర్శ బాలుర హోమ్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ తరుపున విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయరంగా మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందన్నారు.

### సీఎంకు వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శివచరణ్‌రెడ్డి

మన్సూరాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నేతలకు 20 శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో అర్హత కల యువజన కాంగ్రెస్ నేతలకు అవకాశం ఇవ్వాలని వినతిలో కోరారు.

### కాలనీలో కార్పొరేటర్ పర్యటన


టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించగా వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, ప్రతాప్, సుధాకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

### సైదాబాద్ డిప్యూటీ ఈఓగా సుకన్య



మలక్‌పేట: సైదాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా శంకేశ్వర్‌బజార్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి.సుకన్యను నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్బర్‌బాగ్ డివిజన్ బీ-బ్లాక్ కార్యాలయంలో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ ఈవోగా పని చేసిన తిరునగరి రాధాకృష్ణ అనారోగ్య కారణాల దృష్ట్యా డిప్యూటీ ఈవో అదనపు బాధ్యతలను తొలగించాలని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో బాగ్‌మూసారంబాగ్ హెచ్‌ఎంగా ఆయన కొనసాగనున్నారు. సుకన్య గతంలో కాచిగూడ, మారేడ్‌పల్లి పాఠశాలల్లో హెచ్‌ఎంగా పని చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తానన్నారు.

# అర్ధరాత్రి బస్తీలో వీరంగం

- కత్తులు, రాడ్లతో దాడి
- నలుగురికి తీవ్రగాయాలు


సీసీ ఫుటేజీలో రికార్డయిన దాడి దృశ్యం


గాయపడిన విశేశ్వర్

మలక్‌పేట: అర్ధరాత్రి మందుబాబులు వీరంగం సృష్టించడంతో బస్తీవాసులు భయాందోళనకు గురైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారం బస్తీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారం బస్తీకి చెందిన అరవింద్, హరిశంకర్, విశ్వేశ్వర్ ముగ్గురు స్థానిక బస్తీదవాఖానా ఎదురుగా ఉన్న లైన్‌లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదే ప్రాంతాలనికి చెందిన సాయి, మరో వ్యక్తితో వచ్చి బైక్‌పై వచ్చి దురుసుగా ప్రవర్తించడంతో ఇరువురి నడుమ వాగ్వాదం జరిగింది. కాసేపటి తర్వాత నరేష్ అలియాస్ నాచ్, బాబుల్లా, వంశీ, సురేష్, లిటిల్, రంజిత్ మరికొందరు కత్రలు, రాడ్లతో వచ్చి మీరు మా వాళ్లనే కొడతరా అంటూ వారిపై దాడికి పాల్పడ్డారు. గల్లీలో వెంటబడి తరుముతూ కత్రలు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో హరిశంకర్ తలకు తీవ్ర గాయాలు కాగా కర్మన్‌ఘాట్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. అభిలాష్‌కు తలకు 8, విశేశ్వర్‌కు తలకు 18 కుట్లు పడ్డాయి. అరవింద్ మూతి, ముక్కుకు గాయాలయ్యాయి. వారించబోయిన వారిని కూడా గాయపరిచారు. శశికళ అనే మహిళ వారిని ఆపడానికి ప్రయత్నించగా ఆమెపై కూడా దాడి చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దాడిచేసిన వారికోసం గాలిస్తున్నారు. కొందరు యువకులు ఇతర ప్రాంతాలకు చెందిన యువకులతో కలిసి గంజాయి తాగి ఇలా గొడవకు దిగుతారని బస్తీవాసులు పేర్కొంటున్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు


గోడ నిర్మించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

నాగోలు: ఫతుల్లాగూడలోని ఆప్కో కాలనీ రోడ్ నెంబర్-9 నుంచి ఆనంద్‌నగర్ మెయిన్ రోడ్డుకి వెళ్లే దారిని బ్లాక్ చేసి అక్రమంగా గోడను నిర్మించారని కాలనీ అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు ఇతర అధికారులు కాలనీలో పర్యటించి సదరు గోడను పరిశీలించి త్వరలోనే పూరి వివరాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలు కాపాడేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అరవింద్ రెడ్డి, సెక్రటరీ వెంకట్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి


జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నాగోలు: వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నాగోలు డివిజన్ ఆనందనగర్ చౌరస్తా మత్తుగుడా కాలనీ రోడ్డులో రోడ్డు పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాలను జీహెచ్‌ఎంసీ అధికారులు, రాజీవ్ స్వగృహ నివాసితులు ధ్వంసం చేస్తున్నారని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో కీసరి నర్సిరెడ్డి, వీరయ్య, యాదయ్య, సైదులు, ఖమ్మం శెట్టి సురేష్ రావు, బుట్టా కృష్ణ ఉన్నారు.

## ఇంజినీరింగ్ కాలేజీల దోపిడీని అరికట్టాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులు, సంతోష్‌కుమార్

హస్తినాపురం: ఇంజినీరింగ్ కళాశాలలో ఇష్టానుసారంగా దోచుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు టీఎస్‌టీసీఈ రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం హస్తినాపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాలలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి పాత ఉత్తర్వులే జారీ చేయడంతో రూ. వెయ్యి కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని, ప్రజాపాలనలో ప్రజలకు అన్యాయం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి మేనేజ్‌మెంట్ సీట్లను ఆన్‌లైన్‌లో చేస్తామని చెప్పి, పాత పద్ధతిలోనే ఉత్తర్వులు జారీ చేసియడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో యోగేశ్‌యాదవ్, బచ్చురామక్రిష్ణ, నాంపల్లి మల్లేశ్ పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లో ఆరెంజ్ ఎస్టేల్ల ఆపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ అసోషియెషన్ మూచ్యువల్ ఎయిడెడ్ కోఆపరేషన్ మెయింటెన్స్ సొసైటి లిమిటెడ్ డైరెక్టర్లను సోమవారం రాత్రి ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మొత్తం 18 మంది డైరెక్టర్లకు గాను 9 మందిని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా అల్వాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బైసారి రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్లుగా తేజోవర్ధన్, శ్రవణ్‌కుమార్, రాఘవేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అవినాష్, జైనీ శ్రీదేవి, వినోద్ కాప్సోజ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సుధాకర్, చంద్ర మోహన్, పురుషోత్తం, హరి, వెంకట్, లక్ష్మీ కాంత్ పాల్గొన్నారు.

### శైలజకు డాక్టరేట్



మన్సూరాబాద్: ప్రముఖ సామాజిక సేవకురాలు, బ్లడ్ అండ్ ఆర్గాన్ డోనర్ సొసైటీ సభ్యురాలు తిప్పని శైలజ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో కసిరెడ్డి సాహిత్యంలో జాతీయవాదం అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు.

## బీటీఓ పద్ధతిలో టాయిలెట్ల నిర్మాణం

- చైర్ పర్సన్ చెకొలేకర్ లక్ష్మి



చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో బీటీఓ (బ్యుల్ట్ ఆఫ్ ట్యాక్స్) పద్ధతిలో మూత్రశాలల నిర్మాణానికి చర్యలు తీసుకొన్నట్లు మార్కెట్ చెర్ పర్సన్ చెకొలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మూత్రశాలల నిర్మాణానికి దాదాపు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని 15 సంవత్సరాల పాటు లీజుకు అనుమతి ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌లో రోడ్డు మీదకు వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్ జామ్‌తో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు, రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని దానిని దృష్టిలో పెట్టుకొని ప్రతి వారం మార్కెట్‌లో ట్రాఫిక్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెట్ చిరునామా సులువుగా తెలిసేలా ప్రతి గల్లికి సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీ సమస్యపై దృష్టి సారించాలన్నారు.

### గృహిణి అదృశ్యం


జ్యోతి

నాగోలు: ఓ గృహిణి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు జైపురికాలనీలో నివాసముండే సంకి జ్యోతి(35) కాత్రావత్ రవి భార్యాభర్తలు. ఈ నెల 21న కుటుంబ విషయమై ఇద్దరి నడుమ గొడవ జరగడంతో పెద్దలు నచ్చజెప్పి జ్యోతిని సమీపంలోని బంధువుల ఇంటికి పంపించారు. ఈ నెల 22న బంధువుల ఇంట్లో ఉన్న జ్యోతి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లి పోయింది. బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి కృష్ణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.43, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.65, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.45, దొండ రూ.18, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.16, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28.

## భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం


పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణరెడ్డి


కమిషనర్ వెంకట్రావ్ దంపతులతో ఆలయ సిబ్బంది

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి దర్శనానికి హాజరయ్యే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆలయ పాలక మండలి చైర్మన్ ఈదుల కంటి సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆలయ ప్రాంగణంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి ఆలయంలోని పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు స్థానిక నివాసి సోమలింగంగౌడ్ తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేయనున్న పైపులైన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సోమలింగంగౌడ్ దంపతులను ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు.

ఎండోమెంట్ కమిషనర్ ప్రత్యేక పూజలు..
రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్ దంపతులు మంగళవారం ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయంలో భక్తుల సౌకర్యాల కోసం ప్రత్యేక ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించి ఆలయ ఈఓ లావణ్య, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రమాదేవి, వెంకటయ్య, వేణు, ఆలయ అర్చకులు అంబ ప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సంతోష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దీవెనలతో సుభిక్షంగా ఉండాలి


బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీ మహిళా మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన బోనాల జాతరలో ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఆషాఢమాసంలో జరిగే బోనాల పండగకు ప్రత్యేకత ఉందని, తెలంగాలో బోనాల పండగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. ఖిల్లా మైసమ్మ అమ్మవారి దీవెనలతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మురుకుంట్ల అరవింద్, పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, కొండ్రా శ్రీనివాస్, ఊర్మిళ పాల్గొన్నారు.

## ముగిసిన మహంకాళి జాతర


అన్నదానంలో పాల్గొన్న సుభాష్‌చందర్జీ

సైదాబాద్: శ్రద్ధాబాద్ మార్కెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 47వ సంవత్సర మహంకాళి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయని అసోషియేషన్ చైర్మన్ సుభాష్‌చందర్జీ అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ చేపల మార్కెట్ వద్ద అసోషియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అమ్మవారికి బోనాల సమర్పణ, సోమవారం ఘటాల ఊరేగింపు, మంగళవారం భక్తులకు అన్నదాన కార్యక్రమంతో మూడురోజులు సాగిన మహంకాళి జాతర మహోత్సవాలు ముగిసాయన్నారు. జాతర మహోత్సవాలు ప్రశాంత వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించడంలో సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు సిబ్బంది, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సహదేవ్ యాదవ్, కడారి రాంకుమార్, పుష్పరాజ్, దినేష్ కుమార్, అశీష్, సర్వోత్తమ్ పాల్గొన్నారు.

### క్రెడిట్ కార్డు కేవైసీ పేరుతో రూ. 1.2 లక్షలు స్వాహా

నాగోలు: క్రెడిట్ కార్డు కేవైసీ చేయాలని చెప్పి రూ.1.2 లక్షల కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..హస్తినాపురం ఇంటూరి సాయిదీప్ నగరంలోని మెకానిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న ఓ గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి క్రెడిట్ కార్డు కేవైసీ ప్రాసెస్ చేయాలని చెప్పి అతడి స్క్రీన్ షేరింగ్ ఆన్ చేయమని చెప్పాడు. ఈ తరువాత అతడి దృష్టి మరల్చడానికి క్యాలిక్యులేటర్ తెరవమన్నాడు. కాల్‌లో ఉండమని చెప్పి అతని క్రెడిట్ కార్డ్ ఓటీపీ సమాచారం తెలుసుకుని అతని కార్డులోంచి రూ.1.2 లక్షలను కాజేశాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు దిల్‌కుషా ఫంక్షన్‌హాల్, ఫైర్‌స్టేషన్, ఆఫీసర్ మెస్, ఆర్యసమాజ్, ఫాతిమా మాస్క్, రామాలయం టెంపుల్, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్, దయానంద్ నగర్ పరిసర ప్రాంతాలు.ఉదయం 11 గంటల నుండి 11.30 వరకు హదీ అమ్రీన్ మజీద్, మూన్లీ స్కూల్, సీబీబీ క్వార్టర్స్, ఓల్డ్ మలక్‌పేట వాటర్‌ట్యాంక్, జియా ఉల్ కా మజీద్, అబుబకర్ మజీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.